ప్రజాశక్తి

పింఛనుదారులకు భరోసా

లబ్ధిదారుడు మృతి చెందితే భార్యకు మరుసటి నెల నుంచే పింఛను

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సామాజిక ఫించను పొందుతున్న లబ్ధిదారుడు మృతి చెందితే, అతని భార్యకు మరుసటి నెల నుంచే వితంతు పింఛను అందనుంది. ఈమేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఇంటి పెద్ద ఆ నెలలో 15వ తేదీ కంటే ముందుగా మృతి చెందితే, అతని భార్యకు మరుసటి నెల నుంచే వితంతు పింఛను అందుతుంది. 15వ తేదీ తర్వాత మరణిస్తే ఆపై వచ్చే నెల నుంచి అందుతుంది. కుటుంబ యజమాని మరణించిన తర్వాత అందుకు తగిన ధ్రువపత్రాలు అందజేస్తే, తదుపరి నెలలో పింఛను మంజూరు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేదింటి పెద్ద మృతి చెందినా ఇకపై ఆర్థిక భరోసా అందనుంది.

సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్య ప్రైవేటీకరణ

- సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలి
- ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు
- ప్రభుత్వ విద్య బలోపేతానికి యుటిఎఫ్ కృషి
- జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య
- ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు ప్రారంభం

ప్రదర్శన నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - మందస, పలాస

ప్రభుత్వ విద్యారంగానికి 30 శాతం నిధులు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సి ఉన్నా, పది శాతం కూడా కేటాయించడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. నిధుల్లేమి వల్ల సంస్కరణల పేరిట ప్రపంచ బ్యాంకు నిధులతో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి చేస్తున్న ప్రయత్నం ప్రభుత్వ విద్య ప్రైవేటీకరణకు దారితీస్తోందన్నారు. ప్రభుత్వ విద్య గొంతు నులిమే సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు మందస మండలం హరిపురంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా జాతీయ పతాకాన్ని బొడ్డేపల్లి మోహనరావు, ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని బమ్మిడి కృష్ణారావు, యుటిఎఫ్ పతాకాన్ని ఎన్.తవుడు ఆవిష్కరించారు. అనంతరం హరిపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా రట్టి రోడ్డు జంక్షన్ అక్కడ నుంచి హరిపురం బస్టాండ్, ఉన్నత పాఠశాల వరకు ఉపాధ్యాయులు భారీ ప్రదర్శన చేపట్టారు. హరిపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలహీనపరిచే విధానాలను ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులదేనన్నారు. గత ప్రభుత్వం 117 జిఒ తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను అస్తవ్యస్తం చేసిందన్నారు. దీని ఫలితంగా రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులు విడిచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళిపోయారని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తుందని ఆశించినా ఆ దిశగా ఆలోచనలు కనిపించడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తోందని విమర్శించారు. 12వ పిఆర్‌సి 2023 జూన్ నుంచి రావాల్సి ఉన్నా, ఇంతవరకు కమిషన్‌ను నియమించలేదన్నారు. తక్షణం 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం సాగిస్తోందని వివరించారు. సిపిఎస్ రద్దు కోరుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సిఎం కార్యాలయ ముట్టడిలో 5,672 మందిపై కేసులు పెట్టినా, నిర్బంధాలకు గురిచేసినా రాజీ లేని పోరాటం చేసిందని గుర్తుచేశారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి యుటిఎఫ్ కృషి

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి యుటిఎఫ్ కృషి చేస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య అన్నారు. విద్యార్థులకు విజ్ఞానంతో పాటు ఆటపాటలు, నైతిక విలువలతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక ఆయుధమన్నారు.

పోరాటాలతో పాటు సామాజిక బాధ్యత

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలకే పరిమితం కాకుండా, సామాజిక అంశాలపై బాధ్యతతోనూ యుటిఎఫ్ పనిచేస్తోందన్నారు. కోవిడ్ సమయంలో ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు. విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి

ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కోరారు. ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన మందస నుంచి ప్రచారం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థి, యువజన, సైన్స్ ఉద్యమాల్లో కొనసాగి, ఉపాధ్యాయ ఉద్యమంలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం తాను పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు.

కార్యక్రమంలో టెక్కలి డిప్యూటీ డిఇఒ పి.విలియమ్స్, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.కిశోర్ కుమార్, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, నాయకులు కొంచాడ జగన్న, మట్ట ఖగేశ్వరరావు, గుంట కోదండరావు, గున్న రమేష్, ఎల్.వి చలం, జి.కుమారస్వామి, బల్ల చిట్టిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఆకట్టుకున్న కళారూపాలు

స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా పలు కళారూపాలను ప్రదర్శించారు. పొత్తంగి పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి, యుటిఎఫ్ మహిళా నాయకులు మణిమాల, పలువురు ఉపాధ్యాయినిలు నృత్యం చేశారు. పలాస మండలం రేగులపాడుకు చెందిన తప్పెటగుళ్ల విన్యాసాలు ఉత్సాహాన్ని రేకెత్తించాయి. వారితో పాటు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎస్.కిషోర్ కుమార్, బాబూరావు తదితరులు కాలు కదిపారు.

యుటిఎఫ్‌లో చేరిన మధు

మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు సమక్షంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గొండు మధుసదూనరావు చేరారు. ఈయనకు యుటిఎఫ్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుసూధనరావు మాట్లాడుతూ యుటిఎఫ్ పోరాటాలకు ఆకర్షితులై చేరానని తెలిపారు.

శ్రీకాకుళం : జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మోహనరావు

బిజెపి కార్మిక, రైతు వ్యతిరేకి

- కార్మిక, కిసాన్ మోర్చా బైక్ ర్యాలీ
- 26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని పలు కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ... ఆల్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన్న ఆదివారం శ్రీకాకుళం బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని స్థానిక అంబేద్కర్ కూడలి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ నుంచి ఏడు రోడ్ల కూడలి, పాతబస్టాండ్, సూర్యమహల్ కూడలి మీదుగా ఆర్‌టిసి కాంపెక్స్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, ఎస్‌కెఎం కన్వీనర్ తాండ్ర ప్రకాష్, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, కార్మికులను నష్టపరిచే సంస్కరణలను మరింత వేగం చేసిందని విమర్శించారు. ఎన్‌డిఎలో భాగస్వామ్యంగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలు బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడటం లేదన్నారు. ధరలు పెరగుతున్నా కార్మికులకు గత పదేళ్లగా కనీస వేతనాల పెంచలేదని చెప్పారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన స్కీమ్ కార్మికులను 'కార్మికులుగా' గుర్తించడంలేదన్నారు. కార్మికులతో ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేయిస్తూ వారిని పర్మినెంట్ చేయడం లేదన్నారు. కార్మిక హక్కులు కాలరాసే దుర్మార్గమైన 4 లేబరు కోడ్లను వెంటనే రద్దుచేయాలని, విశాఖస్టీల్ ప్రయివేటీకరణను ఆపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా జిల్లా అధ్యక్షులు పొందూరు చంద్రరావు, పిఒడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, నాయకులు పి.గోపి, టి.త్రినాథరావు, ఎం.రమణ, కేదారీశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

రణస్థలం : ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, కిసాన్ కాంగ్రెస్ నాయకులు అబోతుల వెంకటనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు రామతీర్థాల కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు కె.జోగి బాబు, దన్నాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మత్తు, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గంజాయి కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, పోలీస్ జాగిలాలతో విస్తృతంగా తనిఖీలు, నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా, సంకల్పం పేరుతో అవగాహనా కార్యక్రమాలు, చెక్‌పోస్టులు ఏర్పాటు తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా సరిహద్దుగా ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం, పాతపట్నం, పైడిభీమవరం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, అన్ని విభాగాల సమన్వయంతో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గంజాయి మూలాలను కనిపెట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీసు జాగిలాల సహాయంతో రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, పార్సిల్ సర్వీసు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, కార్గో సర్వీసులు, గోడౌన్లు, లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. రణస్థలం మండలం కోష్ట పంచాయతీలోని పైడిపేటలో పసుపురెడ్డి నూకరాజు ఇంటి వద్ద పెంచుతున్న గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 40 కేసుల్లో గంజాయి కేసుల్లో 106 మందిని అరెస్టు చేసి 1250.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి వినియోగం, సేవించడం, క్రయ విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు.

ప్రభుత్వ విప్ అశోక్‌కు ఘన స్వాగతం

- అడుగడుగునా అపూర్వ ఆదరణ
- ఘనంగా సత్కరించిన కూటమి నాయకులు

ప్రజాశక్తి - కవిటి, సోంపేట, పలాస

ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఆదివారం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా ఆయనకు అపూర్వ ఆదరణ లభించింది. పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు సోంపేట మండలం కొర్లాం కూడలికి చేరుకుని అశోక్ రాక కోసం చూశారు. ఆయన చేరుకున్నాక క్రేన్ సహాయంతో గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కొర్లాం జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బారువ జంక్షన్, లక్కవరం, పలాసపురం మీదుగా సోంపేట, తలతంపర, మాణిక్యపురం, బల్లిపుట్టుక, కుసుంపురం మీదుగా కవిటి చేరుకుంది. మహిళలు నీరాజనాలు పలికారు. యువకులు ద్విచక్రవాహనాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై అశోక్ ప్రజలకు అభివాదం చేశారు. కవిటి మండలం బొరివంకలో మాజీ ఎమ్మెల్యే బెందాళం వెంకటేశ్వర శర్మ భార్య నిర్మలను చూసి వాహనంపై నుంచి దిగి వారి నివాసానికి వెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సోంపేట : కొర్లాంలో అశోక్‌కు గజమాల వేస్తున్న నాయకులు

ఎమ్మెల్యేగా వెంకటేశ్వర శర్మ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

మీ అభిమానానికి రుణపడి ఉంటాను

ఇచ్ఛాపురం ప్రజల అభిమానానికి రుణపడి ఉంటానని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని తన నివాసం వద్ద కూటమి శ్రేణులు, అభిమానులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజాభిమానానికి మించిన పదవి లేదని, ఆ అభిమానమే తనను ఇంతవరకు తీసుకొచ్చిందన్నారు. ఇప్పటివరకు తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ దంపతులను పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. ఇటీవల కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు చేపట్టిన దాసరి రాజు, బార్ల చినబాబు, రైల్వే కమిటీ సభ్యుడు శ్రీనివాస రంగా రౌలోను సత్కరించాయి. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, కూటమి నాయకులు సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, వెదుళ్ళ హరికృష్ణ, బడే సూరి, బిన్నల జగన్నాథం, రామ్ బుడ్డి గణపతి, సదానంద రౌలో తదితరులు పాల్గొన్నారు.

తొలుత ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు పలాస మండలంలోని లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, విఠల్‌రావు, దువ్వాడ హేంబాబు చౌదరి, బూరెల కృష్ణంరాజు, సాసుమాన చంద్రమౌళి పాల్గొన్నారు.

కవిటి : మాజీ ఎమ్మెల్యే భార్యను పరామర్శిస్తున్న అశోక్

హాల్ టిక్కెట్లు ఇవ్వకపోతే కఠిన చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికీ హాల్ టిక్కెట్లు నిరాకరించడం గానీ తరగతులకు, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం చేయరాదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలో ఏ కళాశాలలో అయినా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ జరగలేదనే కారణంతో ఇటువంటి చర్యలకు పాల్పడిన కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాల ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంతమంది పోస్ట్‌మెట్రిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలు రాయనీకపోవడం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కోర్సు పూర్తయిన విద్యార్థుల సర్టిఫికెట్లను వారికి ఇవ్వకుండా అట్టిపెట్టుకోరాదని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థుల సర్టిఫికెట్లను అట్టిపెట్టుకుంటే సంబంధిత కళాశాలను బ్లాక్ లిస్టులో పెట్టడం, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల ఖాతాల్లోకి జమ చేస్తుందని ప్రకటించిందని గుర్తుచేశారు. ఏ కళాశాలలోనూ విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులు పెట్టరాదని పేర్కొన్నారు.

దేశ సేవకు ప్రతిరూపం ఎన్‌సిసి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దేశంలో ప్రతి విద్యాసంస్థల్లోనూ ఎన్‌సిసి ఒక నిర్బంధ భాగం కావాలని, దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో చక్కని ఆలోచనతో ప్రతిఒక్కరూ విధిగా విద్యార్థి జీవితంలో ఎన్‌సిసిలో చేరాలని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ పిలుపునిచ్చారు. నేషనల్ క్యాడేట్ కోర్ 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపటి పౌరుల్లో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందిచుకోవడానికి ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్‌లు ఎంతో తోడ్పడతాయన్నారు. ప్రపంచంలో అతిపెద్ద యూనిఫాం ఉన్న యువజన దళంగా ఎన్‌సిసి ప్రసిద్ధిగాంచిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సంభవించే సమయంలో, కరోనా విపత్కర పరిస్థితుల్లో ఎన్‌సిసి విద్యార్థులు అందించే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అంతకన్న ముందు ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు ప్రదర్శించిన మాస్ డ్రిల్ తిలకించారు. జెండా వందనం స్వీకరించారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఎన్‌సిసి అధికారి, లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ వై.పోలినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, పీజీ గుప్తాసింహాద్రి వేణుగోపాల్, ఎస్.సంజీవరావు జి.లక్ష్మి పాల్గొన్నారు.

బహుమతిని అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

జనసేన నాయకులపై మాధురి ఫిర్యాదు

సిఐకి ఫిర్యాదు చేస్తున్న మాధురి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జనసేన నాయకులపై వైసిపి మహిళా కార్యకర్త దివ్వల మాధురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ రాగా, పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, మాధురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో గందరగోళం ఏర్పడింది. సోషల్ మీడియాలో తనపైన అసభ్యకరమైన పోస్టులు, ట్రోల్స్ చేస్తున్న వారిపై ఫిర్యాదు చేయడానికి వచ్చానని చెప్పడంతో సిఐ విజయకుమార్ అనుమతి ఇవ్వడంతో ఆయనకు ఫిర్యాదు చేశారు. జనసేన నాయకులు తనపై అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆమె వాపోయారు. రెండు నెలల క్రితమే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని, ఎందుకు కేసు నమోదు చేయలేదని సిఐని ప్రశ్నించారు. ఇప్పటికైనా జనసేన నాయకులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తానని చెప్పారు. అనంతరం తనపై అసభ్య పోస్టులు పెట్టిన పెన్‌డ్రైవ్‌ను సిఐకి అందజేశారు. ఆమె వెంట వైసిపి నాయకులు పేడాడ రమేష్, కోత సతీష్, తమన్నగారి కిరణ్, పీత హేమలత, బమ్మిడి తులసీరావు, చింతాడ అప్పన్న ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు బయోమెట్రిక్

- 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ
- రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు
- రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ధాన్యం ఇచ్చిన రైతుకు 48 గంటల్లో వారి ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో లక్ష్యం అంటూ పెట్టుకోలేదని, రైతు పండించిన పంటనంతటినీ కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లకు ఎప్పటిమాదిరిగానే ఈ-క్రాప్‌లో నమోదైన పంటనే కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం తీసుకొచ్చి రైతుసేవా కేంద్రాలకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇస్తేనే మద్దతు ధర దక్కుతుందని చెప్పారు. ధాన్యం కొనుగోలులో గతేడాది తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలుతో పాటు భూ సర్వేలో తప్పిదాల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు, ఇసుక అక్రమ తవ్వకాలపై తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో ఆయన వివరించారు.

? ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను వివరిస్తారా?

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తొలుత 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించాం. ధాన్యం కొనుగోలు కోసం జిల్లావ్యాప్తంగా 402 కేంద్రాలను ఏర్పాటు చేశాం. సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ ఇచ్చేందుకు 268 మిల్లులను గుర్తించాం. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు వంటి అవసరాల కోసం సిబ్బందిని ఇప్పటికే నియమించాం. సిబ్బంది నియామకం సంబంధిత ఏజెన్సీలే చూసుకుంటాయి. ప్రభుత్వం చెల్లించిన కమీషన్‌లో వారికి వేతనాలు చెల్లిస్తాయి.

? జిల్లాలో కొంతమంది మిల్లర్లు ఒడిశా ధాన్యం కొంటున్నారన్న ఆరోపణలు చాలా ఏళ్లుగా ఉన్నాయి. దీన్ని అధిగమించడానికి ఏం చేయబోతున్నారు?

ఒడిశా ధాన్యం కొనుగోలు చేయకుండా అన్నిరకాల కట్టడి చర్యలు తీసుకుంటున్నాం. ధాన్యం రవాణా చేసే వాహనాలకు ఈ ఏడాది కొత్త జిపిఎస్ పరికరాలను అమర్చుతున్నాం. కళ్లాల నుంచి మిల్లులకు ధాన్యం తీసుకువెళ్లే వాహనాలకు వీటిని పెడుతున్నాం. ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తాం. కంట్రోల్‌రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ చేపడతాం.

? గతేడాది కొన్ని కొనుగోలు కేంద్రాలు తమ లక్ష్యమైపోయిందంటూ ధాన్యం తీసుకునేందుకు నిరాకరించాయి. రైతులను చాలా దూర ప్రాంతాల మిల్లులకు పంపించడంతో వ్యయ ప్రయాలసలకు లోనయ్యారు. వీటిని ఈ సంవత్సరం ఎలా అధిగమించనున్నారు?

ధాన్యం కొనుగోలులో గతేడాది ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కూడా కొన్ని స్వల్ప మార్పులు చేసింది. రైతులు ఏ మిల్లుకు తీసుకువెళ్లాలో గతంలో ఆన్‌లైన్‌లో తెలిసేది. ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. రైతులు తాము కోరుకున్న మిల్లులకు ధాన్యం ఇవ్వొచ్చు.

? ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. అనుమతుల్లేని రీచ్‌ల నుంచి ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేసి కేసులు పెడుతున్నాం. ప్రజల్లో మరింత అవగాహన పెరగాలి. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణపై అంశాలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకొస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

? జిల్లాలో భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

భూ సమగ్ర సర్వే సందర్భంగా తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సూచనల మేరకు జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. జిల్లాలో 728 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 631 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో ఇప్పటివరకు 30 వేల వరకు ఫిర్యాదులు వచ్చాయి. మ్యుటేషన్ సమస్యలపై అత్యధికంగా తొమ్మిది వేల మంది వినతిపత్రాలు ఇచ్చారు. సబ్ డివిజన్ కోసం ఎనిమిది వేల మంది ఫిర్యాదు చేశారు. ఇతర సమస్యలపైనా వినతులు అందించారు. వచ్చే నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నాం. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

పోస్టర్లు పంపిణీ చేస్తున్న రైతుసంఘం నాయకులు

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఈనెల 26న పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లాకమిటీ సభ్యులు కొర్నాన బాలాజీరావు కోరారు. బెండి, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, చినవంక గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పోస్టర్లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ సమస్యలు పరిష్కారానికి ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోనారి హేమసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో రోటరీ క్లబ్ సభ్యులు

5కె రన్ విజయవంతం

ఇచ్ఛాపురం : న్యూ జనరేషన్ మంత్ సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యాన 5కె రన్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 5కె రన్, బాలికలకు 3కె రన్ నిర్వహించారు. 5కె రన్‌లో లొద్దపుట్టికి చెందిన కుషాల్ ప్రథమ స్థానం, ఇచ్ఛాపురానికి చెందిన ఎన్.సతీష్‌కి ద్వితీయ, ఈదుపురానికి చెందిన ఎల్.నాని తృతీయ స్థానం సాధించారు. అలాగే 3కె రన్‌లో ఈదుపురానికి చెందిన బోర బాబీ ప్రథమస్థాం, బాలికోన్నత పాఠశాలకు చెందిన అమృత ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన గొర్రెల భవానీ తృతీయస్థానం సాధించారు. అనంతరం విజేతలకు రోటరీ క్లబ్ సభ్యులు బహుమతులను అందజేశారు.

మాట్లాడుతున్న గణపతి

పిల్లలను విలువలతో పెంచాలి

ప్రజాశక్తి- సోంపేట

పిల్లలను తల్లిదండ్రులు నైతిక విలువలతో పెంచాలని మనోవికాస నిపుణుడు రామ్‌బుడ్డి గణపతి అన్నారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సామాజిక వనభోజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల పెరుగుదలలో తల్లిదండ్రుల పాత్రపై పలు సూచనలు చేశారు. వృద్ధాప్యంలో శ్రేష్టమైన జీవితాన్ని గడపాలంటే పిల్లల పెంపకండా జాగ్రత్తలు వహించాలన్నారు. నైతిక విలువలను పిల్లల్లో పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పి.వి.ఆర్

తెలగలను బిసిలో చేర్చాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సామాజికంగా, ఆర్థికంగా వెనకబడి ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతున్న తెలగ సామాజిక తరగతిని బిసి జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం నాయకులు పల్లంటి వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పురపాలక సంఘ పరిధిలోని మన్నయ్యపేట ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన తెలగ సామాజిక తరగతి ఆత్మీయ సదస్సును బోడెం భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు ఈ విషయంలో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా బిసి సాధన సమితి ఉత్తరాంధ్ర జెఎసిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలగ సంఘం ప్రతినిధులు రొక్కం సూర్యప్రకాశరావు, అత్తులూరి మురళీమోహన్, చనమల ప్రసాదరావు, మెండదల రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

పట్టుశాలి సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- టెక్కలి

పట్టుశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘ నూతన గౌరవాధ్యక్షులుగా దుంపా లోకేశం, అధ్యక్షులుగా మలిపెద్ది మధుసూదనరావు, ఉపాధ్యక్షులుగా బుడ్డ భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా దుంపా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా బుడ్డ నందికేశ్వరరావు, కోశాధికారిగా కొండేటి అచ్యుతరావుతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విశ్రాంత ఇంజినీర్ పమ్మిన సింహాచలాన్ని సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ సంఘ పురోభివృద్ధికి సమిష్టి కృషి అవసరమన్నారు. కార్యక్రమంలో బస్వా శ్యామ్ సుందరరావు, దున్న సాంబ శివరావు, పేకల సోమేశ్వరరావు, ఆట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

జిల్లా కేంద్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరు వాసు, కొన్న శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని, యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా అరవింద్, కార్యదర్శిగా సాంబశివరాజు, ఉపాధ్యక్షునిగా కర్ణవీరుడు, ఆమోష్, సహాయ కార్యదర్శులుగా రాము, వాసు, కోశాధికారిగా ఎం.శ్యామ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వసంతరావు, క్రాంతి, వెంకటరమణ, హరి, రామారావు, రాజారావు, ఢిల్లీశ్వరరావు, తిరుమల పాల్గొన్నారు.

గ్రామగ్రామాన బెల్ట్ షాపులు

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు
- ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పలు గ్రామాలు, పట్టణంలోని కూడళ్లలోని పాన్‌షాపుల వద్ద మద్యం అమ్మకాలు బెల్ట్ షాపుల రాకతో జోరందుకున్నాయి. మండలంలోని ప్రతి

ద్విచక్ర వాహనంపై సరఫరా చేస్తున్న మద్యం బాటిళ్లు

గ్రామంలో అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేకుండా ఎవరికి వారే మద్యం అమ్మకాలను కొనసాగిస్తుండడం విశేషం. గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న నిర్వాహకులు క్వార్టర్ బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులను గుల్ల చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి మండలంలో రెండు మద్యం దుకాణాలు, పట్టణంలో నాలుగు మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరయ్యాయి. ప్రభుత్వ అనుమతులు పొందిన మద్యం దుకాణాల నుంచి షాపు నిర్వాహకులు మండలంలోని గ్రామ గ్రామానికి మద్యం బాటిళ్లను తరలిస్తూ బెల్ట్‌షాపుల నిర్వాహకులకు పూర్తి స్థాయిలో అండదండలు అందిస్తూ మద్యం వ్యాపారాన్ని విస్తృత పరుస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే బెల్ట్‌షాపుల నిర్వహణ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా దొరుకుతుండడంతో ఎటువంటి అనర్థాలు చోటు చేసుకుంటాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎక్సైజ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారో విశ్రాంతి తీసుకుంటున్నారో అర్థం కావడం లేదని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి నెలవారి మామూళ్లు అందుతుండడంతోనే బెల్ట్‌షాపులపై చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. బెల్ట్‌షాపుల ద్వారా పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా వాడవాడలా అమ్మకాలు జరుగు తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు చర్చించు కుంటుండడం విశేషం. బెల్ట్‌షాపుల్లో మద్యం సేవించి మందుబాబులు గ్రామాల్లో తగాదాలకు దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. గతంలో మాదిరి షాపుల్లోనే మద్యం విక్రయించాలని గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా విక్రయించడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు, విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్ట్‌షాపుల నిర్వహించకూడదన్న స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తుంది.

బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం పాట

మెట్టక్కివలసలోని బెల్ట్‌షాపు వద్ద యువత

మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని పొన్నాంపేటలో బెల్ట్‌షాపు నిర్వహించుకోవడానికి ఆ గ్రామానికి చెందిన ఇరు పార్టీల నాయకులు వేలం పాట నిర్వహించడంతో గ్రామంలోని కొంతమంది పోటీపడి ఒక వ్యక్తి రూ.3 లక్షలకు వేలం పాటలో బెల్ట్‌షాపును కైవసం చేసుకుని వెంటనే గ్రామ అభివృద్ధికి రూ.1,50,000 వేలు చెల్లించి ఈ బెల్టుషాపును పొన్నాంపేట చెరువు గట్టుపై బడ్డీ కొట్టులో ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల క్రితం ఎక్సైజ్ పోలీసులు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేసినప్పటికీ మళ్లీ యధావిధిగా బెల్ట్‌షాపును కొనసాగిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామానికి చెందిన నాయకులకు సగం డబ్బులు చెల్లించడంతో గ్రామంలో మరెవరు మద్యం విక్రయించకూడదని ఇరు పార్టీల నాయకులు చెప్పడంతో గ్రామంలోని పలువురు నాయకులు ఎక్సైజ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ తీరుపై ప్రజల అసంతృప్తి

సిఎం చంద్రబాబు నాయుడు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే నిర్వాహకులకు రూ.లక్ష జరిమానా విధించి కఠినంగా శిక్షిస్తామని చెప్పే మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యకం అమ్మకాలు చేపట్టి ఇల్లును గుల్ల చేస్తున్నారని విమర్శించిన టిడిపి నాయకులు నేడు గ్రామాల్లో సందుసందుల్లో ఎనీ టైం మద్యాన్ని సరఫరా చేస్తున్నారని పలువురు మండి పడుతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ ఉన్నతాధికారులు బెల్ట్ షాపులపై దృష్టి పెట్టి విచ్చలవిడిగా దొరికే మద్యాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాలను, ధనాన్ని కాపాడాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఘనంగా ఎన్‌సిసి డే వేడుకలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 76వ ఎన్‌సిసి డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఈశ్వరరావు హాజరై ఎన్‌సిసి జెండాను ఎగురవేశారు. దేశం కోసం పనిచేసే బెస్ట్ సిటిజన్‌గా ఉండాలంటే చిన్నప్పటి నుంచే ఎన్‌సిసి, స్కౌట్ వంటివి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజాబాబు, ఎన్ఇఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఊర్మిళ దీక్షిత్ పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి- పోలాకి

ఇటీవల రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా జిల్లాలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఒ-2 టి.లింగరాజు అభినందనలు తెలిపారు. పోలాకి బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు ఆదివారం అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో పోలాకి బాలికల హైస్కూల్ నుంచి వక్తృత్వ పోటీలో ఎన్.లావన్య, కె.పూజిత, పాటల పోటీలో పి.భవాని, వ్యాసరచన పోటీలో డి.ద్రాక్షాయిని, పి.సాయి, హన్సిక విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఎంపిక

టెక్కలి : గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహిళా వెయిట్ లిఫ్టింగ్ సౌత్ జోన్ అంతర్ వర్సిటీ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సరం బిఎ చదువుతున్న ఎస్.ఝాన్సీరాణి ఎంపియ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ వి.లుక్సాల్, పీడీ బి.సత్యనారాయణ, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఈశ్వర్ అభినందించారు.

'ఐఇఎస్'లో సతీష్‌కు మూడో ర్యాంకు

ప్రజాశక్తి- పోలాకి

సతీష్

ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో మండలంలోని జిల్లేడు మాకివలసకు చెందిన గొల్లంగి సతీష్‌కు మూడో ర్యాంకు సాధించారు. దీంతో ఆదివారం తన స్వగ్రామంలో సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ రాము, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, స్థానికులు సతీష్‌ను, ఆయన తల్లి నిర్మలమ్మను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరు పేద కుటుంబంలో ఉన్నప్పటికీ పట్టుదలతో చదివి ఉన్నత స్థాయి సంపాదించడం గర్వకారణంగా ఉందన్నారు.

4న 'చలో విజయవాడ'

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరుకు వ్యతిరేకంగా డిసెంబరు 4న చలో విజయవాడ నిర్వహిస్తున్నామని సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సభయలు మద్దిల మల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని బొడ్డపాడులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం మనకిచ్చిన హక్కులను మనం కాపాడుకోవాలన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాలని కోరారు. ఇండియా కూటమిలో భాగంగానే జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికల్లో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రెండు ప్రాంతాల అభ్యర్థులను గెలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. దుష్యంత్, అప్పారావు, కామేశ్వర రావు, అప్పయ్య, ఈశ్వరమ్మ, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'108'ను ప్రభుత్వమే నిర్వహించాలి

పలాస : 108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని 108 ఉద్యోగులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో ఆదివారం 108 వాహనం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాల శ్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గత టిడిపి ప్రభుత్వంలో జిఒ నవంబరు రూ.4 వేలు పునరుద్ధరించాలన్నారు. అలాగే 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, సిబ్బంది సత్యం, వెంకటరావు, తారక్, మోహనరావు, నాయుడు, వినోద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రంలో ఆదివారం యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నమ్మి అధ్వర్యంలో 200 కేజీల ఘనజీవామృతం, 30 లీటర్ల బ్రహ్మాస్త్రం రైతులచే తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరటితోటల కోసం ఘన జీవమృతం, మిరప, టమోటా పంటలకు కాండం తొలిచే పురుగు నివారణకు బ్రహ్మాస్త్రయం వాడాలన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు రమణమ్మ, మాధవి, స్వాతి, కోటేశ్వరి పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారు చేస్తున్న మహిళా రైతులు

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నరసన్నపేట: నియోజకవర్గంలో అక్రమ ఇసుక తరలింపు వైసిపి నాయకులు ఘనతే అని టిడిపి నరసన్నపేట, పోలాకి మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ఎం.వెంకట అప్పలనాయుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు విమర్శించారు. నరసన్నపేట టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి గతంలో చేసిన తప్పుడు విధానాలను, దోపిడీలను ప్రజలు గమనించి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి గెలిపించారని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరు నెలల్లోనే రూ.50 కోట్లలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఇకనైనా వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో కూటమి నాయకులు జామి వెంకటరావు జల్లు చంద్రమౌళి, భైరి భాస్కర్, సూరపు నారాయణదాసు, మైలపల్లి త్రినాథరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణిత ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- టెక్కలి

సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్ష ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గస్థాయిలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల నుంచి 8,9,10 తరగతుల్లో చదువుతున్న 71 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలకు భాస్కరరావు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ పరీక్ష అనంతరం విద్యార్థులందరికీ ఎంఇఒ తులసీరావు, ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ఆ

జ్ఞాపికలు అందజేస్తున్న ఎంఇఒ తులసీరావు

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల నుంచి గణిత ఉపాధ్యాయులు నరేష్, రుషి, హేమసుందర్, జానకిరామ్, అప్పారావు, మురళీకృష్ణ, శైలజ, చంద్రశేఖర్, స్వర్ణలత పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌విఎస్‌ఎస్ వార్షికోత్సవం

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గొల్లమాకన్నపల్లిలో స్వామి వివేకానంద సేవా సమితి ఆరో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరేళ్ల క్రితం యువకులు బన్ని, ధర్మ, కిరణ్‌ల ప్రోత్సాహంతో స్థాపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఉద్దానం ప్రాంతం నుంచి యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. స్థానిక హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో లోహరిబంద, పలాస, గురుదాసుపురం టీమ్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నగదు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి కోరాడ ధనరాజు, ఉప సర్పంచ్ రాపాక పురుషోత్తం, పున్నయ్య మాస్టర్, తులసీదాస్ మాస్టర్, ఫుడ్ బ్యాంకు ఇన్‌ఛార్జిలు దాసరి సాయి, కొర్రాయి రమేష్, కుత్తుం వినోద్ పాల్గొన్నారు.

కవికి సన్మానం

పలాస : ప్రజా కవి, రచయితగా రాణిస్తున్న మండలంలోని మాకనపల్లికి చెందిన కుత్తుం వినోద్‌కుమార్‌ను స్వామి వివేకానంద సేవా సంస్థ సభ్యులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌విఎస్‌ఎస్ సైనికులు మాట్లాడుతూ శ్రమజీవులు పక్షాన తన రచనలను కొనసాగిస్తూనే ఉద్దానం ప్రాంతంలో విద్యార్థులను, విద్యా ఉద్యోగ రంగాలను ప్రోత్సహిస్తున్నట్లు కవి వినోద్‌ను కొనియాడారు.

సముద్ర తీరం జనసంద్రం

ప్రజాశక్తి- పోలాకి

కార్తీకమాసం పురస్కరించుకుని మండలంలోని రాజారాంపురం సముద్రతీరానికి యాత్రికులు తరలిరావడంతో జనసంద్రంగా మారింది. ఆదివారం సెలవు కావడంతో దూర ప్రాంతం నుంచి చిన్న, పెద్ద అనే తేడా లేకుండా తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. సుదూర ప్రాంతాల నుంచి కారులపై, ఆటోలపై కుటుంబ సమేతంగా వచ్చి వనభోజనాలు ఆచరించి సముద్రతీరంలో స్నానాలు చేసి ఆనందంగా గడిపారు. సందర్శకులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ జి.రంజిత్ ఆధ్వర్యాన పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి శివసాగరానికి యాత్రికులు తరలివచ్చారు. తీరంలో పర్యాటకులు

పోలాకి : సముద్ర తీరంలో పర్యాటకుల సందడి

సామూహిక విందు భోజనాలు చేసి సముద్ర స్నానాలు ఆచరించి సరదాగా గడిపారు. ఒడిశా రాష్ట్రం పర్లఖిమిడి, మోహన బ్లాక్, గారాబందా, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తదితర ప్రాంలాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కనీస సౌకర్యాలు లేక ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారని పర్యాటకులు వాపోతున్నారు.

వాడబలిజ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని బైపల్లి వాడబలిజ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఆదివారం సంఘం కార్యాలయంలో సంఘం సభ్యుల ఆమోదంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షునిగా మడ్డు లక్ష్మీనారాయణ, అధ్యక్షునిగా చీకటి కామేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా కోనేరు కామేశ్వరరావు, కార్యదర్శిగా మడ్డు సుధీర్, సంయుక్త కార్యదర్శి కోడ పాపారావు, కోశాధికారిగా బొంపల్లి శివకుమార్, మరో పది మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాడబలిజ అభివృద్ధి, సామాజిక కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామన్నారు. నూతన కార్యవర్గాన్ని మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, గ్రామపెద్దలు అభినందించారు.

డిసెంబర్ 6న అంబేద్కర్ వర్ధంతి

పలాస : మండలం బొడ్డపాడులో ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం ప్రజా కళామండలి, ఉత్తరాంధ్ర మహిళా సంఘం, గ్రామ ప్రజలు అంబేద్కర్ వర్ధంతి పోస్టర్‌ను ఆదివారం బొడ్డపాడులో ఆవిష్కరించారు. అనిచి వేయబడిన ప్రజల హక్కులకై భారత రాజ్యాంగ నిర్మాణం చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు అంబేద్కర్ అని వక్తలు అన్నారు. రాజ్యాంగ సవరణ పేరిట నేడు పాలకులు అనేక కొత్త చట్టాలను తీసుకొచ్చి ప్రజాస్వామిక వాదులపై కేసులు పెట్టి అక్రమ నిర్బంధాలకు గురి చేస్తున్నారని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. డిసెంబర్ 6న జరిగే బహిరంగ సభకు ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి డానేష్, సాలిని వీరాస్వామి, చిరంజీవి, ఉత్తరాంధ్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు నాగమణి, సోమనాథం, పిండి వెంకటరావు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కె.వెంకటేష్ అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని మూడో వార్డు ఊసవాని పేటలో సంకల్పం పేరిట సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు నిర్వహించే చిట్ ఫండ్‌లలో చిట్స్ కట్టి మోసాలకు గురి కావద్దన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

పాతపట్నం: మండలంలోని తెంబూరులో ఎస్‌ఐ బి.లావణ్య సంత మార్కెట్ వద్ద సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ : విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ప్రవళ్లిక సూచించారు. మండలంలోని లక్కపురంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారి కదలికలను గమనించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కస్తూరిపాడు పంచాయతీ గంగుపేటకు చెందిన కోనారి శిమ్మయ్య (72) మృతి చెందాడు. శిమ్మయ్య గత రెండేళ్లుగా మతిస్థిమ్మితం లేక రోడ్డుపై సంచరించేవాడు. జాతీయ రహదారిపై నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తుండగా... గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందారు. శిమ్మయ్యకు ఐదుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అయితే కుమారుల్లో పెద్ద, రెండో, మూడువ కుమారులు అప్పారావు, మల్లేష్, సింహాచలంలు నెల్లూరుతో కూలీ పనులు చేసుకుంటున్నారు. నాల్గో కుమారుడు విశాఖలో పనిచేస్తున్నారు. ఐదో కుమారుడు గ్రామంలో ఉన్నారు. కుమార్తె పోలాకి మండలం వనవిష్ణుపురంలో ఉంటుంది. అయితే ఐదో కుమారుడు అనందరావు కుమార్తె పోషణలో ఉండేవారు. రెండేళ్ల నుంచి ఎవరికి చేతికి చిక్కక మతిస్థిమ్మత లేకపోవడంతో కుటుంబసభ్యులు ఎవరి విధుల్లో వారు ఉంటేవారు. కుమారుడు ఆనందరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాతపట్నం : పట్టుబడిన సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- పాతపట్నం

ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పాతపట్నం ఎక్సైజ్ సిఐ కె.కృష్ణారావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో ఆదివారం మండలంలోని చాపరాయిగూడలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 400 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

టెక్కలి రూరల్: మెళియాపుట్టి మండలం సవరకడ్డబలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించామని టెక్కలి ఎక్సైజ్ సిఐ కె.మీరాసాహెబ్ తెలిపారు. ఈ దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊటలు, 20 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో టెక్కలి, నరసన్నపేట ఎక్సైజ్ ఎస్‌ఐలు సత్యనారాయణమూర్తి, కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి- జి.సిగడాం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలం సంత ఉరిటి ఎస్‌సి కాలనీ అగ్ని ప్రమాద బాధితులకు ఆదివారం కిచెన్ సెట్లు, టార్పాలిన్లు, దోమతెరలు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, ఎంసి మెంబర్ శ్రీకాంత్, తహశీల్దార్ శ్రీకాంత్, రెడ్‌క్రాస్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ గొలివి రమణ, పి.చైతన్యకుమార్, విఆర్‌ఒ వెంకటరమణ, పవన్ కుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్ట్

పాతపట్నం : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఐ బి.లావణ్య తన సిబ్బందితో కొరసవాడ, తెంబూరు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై దాడులు నిర్వహించగా కొరసవాడలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక మహిళ వద్ద నుంచి 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు వీధి కుక్కలకు టీకాలు

ఆమదాలవలస: వీధులలో సంచరించే కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు మోణింగి వారి వీధిలో పశుసంవర్ధక శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు పిచ్చికుక్క వ్యాధి (రేబిస్) నివారణ టీకాలు వేయనున్నామన్నారు.